• రచన ఇంటింటి పత్రిక. అక్టోబర్, 2005

# సర్వం జగన్నాథం

"మీరైతే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. మాకు రిటైర్మెంటే లేదు. జీవితాంతం బానిసల్లా పనిచేస్తూనే వుండాలన్నమాట! మాకు మాత్రం కొన్ని సదుపాయాలు లేకపోతే ఎలా? మేం మాత్రం మనుషులం కాదా? మేం చేసేది మాత్రం పనికాదా?" అంది సునంద. ఆమె ఇలా అనటం యిది మొదటిసారి కాదు.

"అదేమన్నమాట. మీలాంటివారికీ, రాజకీయాల్లో పనిచేసేవారికీ రిటైర్మెంటు తప్పకుండా వుండాలి. విశ్రాంతి అన్నది ఒక ఉపాధ్యాయుడికి కావల్సివచ్చినపుడు, ఒక ఉద్యోగికి అవసరైనప్పుడు మీకూ, వారికీ మాత్రం ఎందుకుండకూడదూ? మేధావులైన మహిళలూ, ఓటర్లూ ఆలోచించి ఏదన్నా చెయ్యాలి మరి" అన్నాడు చక్రధరం.

"ఏమో బాబూ. ఎవరి సంగతెలా వున్నా నాకు మాత్రం విశ్రాంతి కావాలి. కనీసం వారం రోజులపాటైనా" అంది సునంద.

"సరే ఈ రోజు నుంచి వారం రోజులు నీకు సెలవు గ్రాంటు చేస్తున్నాను. నువ్వు రోజూ చేసే యింటి పని చేయకు. నేను చూసుకుంటాను. సరా!"

"అలా అంటారు గానీ, నేను తెల్లారే సరికి లేవకపోతే పొయ్యిలో పిల్లి లేవదు."

"ఫర్వాలేదు. రాత్రే వంటింటికి తాళం వేసేస్తాను అది రాకుండా."

"పాలవాడు నాలుగున్నరకే వచ్చి గేటు కొడతాడు మరి......"

"వాడిని తెల్లగా తెల్లారేక రమ్మని చెబుతాను."

"ఎలాగూ సెలవు గ్రాంటు చేసేరు కాబట్టి నేను అలా ఏ వూరన్నా వెళ్ళి రావొచ్చు. అందుకు మీకు మల్లే నాకూ లీవ్‌ట్రావెల్ కన్సెషన్ వుండాలి" అంది సునంద.

"ఏవూరెళ్తావ్. నేను రాకుండానా?" అన్నాడు చక్రధరం ఆశ్చర్యంగా.

"బాగానే వుంది - మీరు ఎల్.టి.సి. పెట్టినప్పుడల్లా మీ బాస్‌ని తీసుకెళ్ళేరా?"

"సరే, నువొక్కదానివే అయినా ఎక్కడికి వెళ్తావ్? అబ్బాయి సింగపూర్‌లోనూ, అమ్మాయి ఆస్ట్రేలియాలోనూ వున్నారాయె. ఒక్కగానొక్క అన్నగారూ, పుట్టింటి దిక్కు అనుకుంటే ఆయనేమో ఓ పుష్కరకాలంగా అమెరికా వెళ్ళి వెనక్కి తిరిగి చూడకుండా అక్కడే వుండిపోయాడు. ఇక మీ అక్క గారింటికెళ్తే... ఆవిడా పెద్దావిడై పోయింది... పైగా నీ

వంట బావుంటుందన్న పుకారొకటి వుంది కాబట్టి అక్కడ వంట నువ్వే చెయ్యాల్సి రావచ్చు."

"సరే. నేనెక్కడికీ వెళ్ళననుకోండి... భర్తగా నా షాపింగ్ ఖర్చులు మీరు పెడతారా?"

"మళ్ళీ అదేమిటి?"

"అదే మరి! నిజంగానే సెలవు పెట్టేస్తున్నా రేపట్నుంచి – కాఫీ, టీ, భోజనం, టిఫినూ, అంతా మీ బాధ్యతే–"

"ఓ.కే. అలాగే."

◆ ❖ ◆

మర్నాడు ఉదయం అలారం కొట్టినా సునంద లేవలేదు. అలారం ఆపేసి పడుకున్నాడు చక్రధరం. లేచేసర్కి ఏడు గంటలయింది– పేపరు చూస్తూ కాఫీ తాగే అలవాటు– మొహం కడుక్కుని వచ్చేసర్కి సునంద పేపరు చదువుతోంది. వంటింట్లోకి తిరిగి చూశాడు. చీకటిగా వుంది. తలుపులు తీసేడు. పిల్లి బయటే వుందికానీ సంతోషించడానికి లేదు – పాలవాడు పాలు తేలేదు – వెళ్ళి తెచ్చుకోవాలి! కాఫీకి డికాక్షన్ వేసి పాల కోసం వెళ్ళేడు. ఈలోగా పేపరు చదవటం పూర్తిచేసిన సునంద బాత్రూంలోకి దూరింది – కాఫీ తయారుచేసి రెండు కప్పుల్లో పోసి చక్రధరం తీసుకొచ్చేసర్కి డ్రాయింగ్‌రూంలో కూర్చొని తల ఆరబెట్టుకుంటోంది.

"కాఫీ బావుంది" అంటూ తొలి కాంప్లిమెంట్ యిచ్చింది.

"పాకశాస్త్ర ప్రావీణ్యులు మొదట మగవారే– వారికి టైం లేక, సంపాదనా తాపత్రయంలో పడిపోయాక, ఆడవారి కిచ్చేశారా పని– ఇప్పటికీ హోటళ్ళల్లో వంటవాళ్లు మగవాళ్ళే. వంటేం బ్రహ్మ విద్యకాదు" అన్నాడు చక్రధరం పేపర్ని చేతిలోకి తీసుకుంటూ.

గంట గడిచింది – సునంద టీవీ చూస్తూ కూర్చొంది. పేపరూ, స్నానం పూర్తి చేసి వచ్చాడు చక్రధరం. బయట ఎండ కరకరలాడుతోంది. కడుపులో కూడ అలాంటి శబ్దమే మొదలయినట్టనిపించింది. రిటైరయ్యాక కూడా ఉదయం ఎనిమిదిన్నరకే ఠంచన్‌గా టిఫిన్ పెడుతోంది. ఎప్పుడూ ఒకటేనా అన్పించకుండా టిఫిన్‌లు మార్చి చేసి పెడుతోంది సునంద.

'ఏదీ మీ పని పిల్ల? ఇల్లు వూడవలేదు – గిన్నెలు తోమలేదు" అంటూ సునంద వంక చూశాడు.

ఈ కోపానికి కారణాన్ని తెల్సుకున్న సునంద తొణక్కుండా, "బావుంది నాకేం తెల్సు? దానికీ సెలవులూ; హక్కులూ, లేట్ కమింగ్‌లూ అన్నీ వున్నాయి మరి" అంది–

"అదేం కుదరదుగానీ ఏడు గంటలకల్లా రాకపోతే పని అవదని చెప్పు. ఈ పూటకు బిస్కెట్లూ, టీయే బ్రేక్‌ఫాస్ట్ మరి" అన్నాడు కాస్త శాంతపడుతూ.

"మీ యిష్టం. అదెప్పటికి వస్తుందో, అంతవరకూ ఆ నాల్గు బిస్కెట్లూ ఆపుతాయా?" అది ఒకవేళ రాకపోతే....?" అనుమానం వ్యక్తం చేసింది.

"రాకపోతే మధ్యాహ్నం భోజనానికి ఏ హోటల్‌కో పోదాం. నాకేం భయమా? పెన్షన్ వస్తున్నంత కాలం మన తిండికి లోటుండదు సుమా!"

నవ్వి వూరుకుందేగాని అక్కడ్నించి కదల్లేదు సునంద. చక్రధరం టీ చేసి బిస్కెట్లు తెచ్చి బల్లమీద పెట్టి "తీసుకో" అన్నాడు.

"టీ బావుంది - ఇరానీ టీ ఎలా వుంటుందో గానీ అంతకంటే బాగుంది" అంది.

చక్రధరం పొంగిపోయేడు -

అనుకున్నట్లే పనిపిల్ల రాలేదాపూట.

◆ ❖ ◆

"చెప్పు. ఏ హోటల్‌కి వెళ్దాం" అడిగేడు చక్రధరం.

"మీ యిష్టమే."

"అయితే యీ మధ్యే కొత్తగా వచ్చిన హిల్‌వ్యూ హోటల్‌కి వెళ్దాం."

"హిల్‌వ్యూ....అంటే ... ఆ కొండ మీద కట్టిందేనా?"

"కొండంటే కొండ కాదు... చిన్న గుట్ట...."

"ఏం గుట్టో... గుమ్మం వరకూ వాహనాలు వెళ్లే రోడ్డు లేదుట - కొండ దిగువన బళ్ళు పెట్టి బోలెడు మెట్లెక్కి వెళ్ళాలట - ఆ హోటల్ పెట్టేక కొండ దిగువన వున్న డాక్టర్ గారికి డిమాండ్ పెరిగిందటగా. బతికుంటే ఏ బాదంగీరో తాగి బతకొచ్చుగానీ నా వల్ల కాదు" అంది.

"పోనీ సీవ్యూ హోటల్‌కి వెళ్దామా!"

"అక్కడ చేపల వాసన, నేను రాలేను"

"ఐతే త్రీస్టార్ హోటల్ మూన్ ఎండ్ స్టార్స్‌కి వెళ్దాం."

"కొండల్నీ, సముద్రాల్నీ, చంద్రుణ్ణీ, చుక్కల్నీ చూపించే హోటళ్ళు వద్దుగానీ మంచి భోజనం పెట్టేదేదైనా వుంటే చూడండి."

"ఐతే హోటల్ దమయంతీ బెస్టు. దగ్గర కూడానూ."

మరో అరగంటలో హోటల్ దమయంతి రిసెప్షన్ కౌంటర్ కెదురుగా వున్న సోఫాలో కూర్చొని వున్నారిద్దరూ. ఏసీ డైనింగ్ హాల్ హౌస్‌ఫుల్ అయిందిట-

పావుగంటలో మోక్షం రానే వచ్చింది. భోజనం అయిందనిపించేసరికి మరో ముప్పావుగంట అయింది-

"ఎలా వుంది భోజనం?" అడిగేడు చక్రధరం యింటికొచ్చేక.

"నా బొందలా వుంది - ఆ టమేటో సూపు, పూరీ ముక్కలూ సగం ఆకలిని చంపేశాయి. అదే ఆనపగాయ కూర నేను చేస్తే వెయ్యివంకలూ, పేర్లూ పెట్టి తినరు- వాడు చేసింది గనక లొట్టలు వేసుకు మరీ ఆరగించేరు."

"అది ఆనపగాయ కూరా? పోల్చుకోలేదు సుమీ. చెప్పుకోరా? నాకది పడదు కూడాను" అన్నాడు చక్రధరం ఆశ్చర్యపోతూ.

"మరదే, ఆ చీకటి గదిలో ఏం కనబడుతుంది గనక? రెండో కూరైనా పోల్చుకున్నారా? అది వంకాయ."

"సరే పుట్టినప్పట్నించీ తింటున్న వంకాయేగా, పోల్చుకోడానికేముందీ? అయినా సాంబారు బావుంది కదా. ఏదైనా వాడే చెయ్యాలది" అన్నాడు.

"చారు చూశారుగా ఎలా వుందో, రసం అంటారు కాబోలు దాన్ని - నీరసంగా వుంది - అదే కప్పుల్తో ఎత్తిపెట్టి తాగేస్తున్నారు. ఇంట్లో యింగువ చారు కరివేపాకు వేసి శుభ్రంగా పెడితే 'చారా' అని తీసిపారేస్తారు."

సునంద మాటలకి చక్రధరం ఏం జవాబివ్వలేదు.

మధ్యాహ్నం నిద్ర అయ్యేక లేచి టీ పెట్టేడు. టీ తాగేక సునంద బట్టల బీరువా సర్దడంలో నిమగ్నమైంది. చక్రధరం కాస్సేపు పేపర్లోని సినిమా పేజీ చూశాడు. కాస్సేపు టీవీ చూశాడు. అప్పటికి ఐదు దాటింది.

"సాయంకాలమౌతోంది. కొంపదీసి మీ పనిపిల్ల ఈ పూట కూడ రాదేమిటి?" అడిగేడు.

"ఒకపూట రాలేదంటే రెండో పూటా రాదు - వాళ్ళకి హాఫ్‌డే సెలవుల్లేవు."

"అయితే భోజనానికి యీ పూటా బయటికే పోదాం. నా చేతి వంట రుచి చూసే అదృష్టం నీకీ రోజు లేదు" అన్నాడు చక్రధరం.

సునంద ఏం మాట్లాడలేదు - ఏడు గంటలు దాటేక స్నానం చేసి తయారై బయటికెళ్ళడానికి రెడీ అయిపోయింది.

"ఈ పూట 'పూబంతి' హోటల్ కెళ్దాం" అన్నాడు చక్రధరం. సునంద తలూపింది. టాప్‌లేని రిక్షాలో బజారంతా చూస్తూ హోటల్‌కి వెళ్ళేరు. రూఫ్‌గార్డెన్ కూడ వుందంటే అక్కడే కూర్చున్నారు. చక్కగా కట్ చేసి పెట్టిన అరిటాకులోని భోజనం, కూరలూ, చూసి ఆశ్చర్యంగా చక్రధరం వంక చూసింది సునంద.

చక్రధరం మరో దృష్టి లేకుండా ఉపక్రమించేడు అప్పటికే.

భోజనమయ్యాక టిప్పుతో సహా నూట పదో నూట యిరవయ్యో ప్లేట్లో బిల్లు మీద పెట్టి లేచాడు చక్రధరం.

"ఒక్కో భోజనం యాభై కంటే ఎక్కువే నన్నమాట!" ఆశ్చర్యంగా అడిగింది సునంద వచ్చేటప్పుడు. చక్రధరం తలూకెట్టి వూరుకున్నాడు.

"అందులో సగమిస్తే నేను బ్రహ్మాండమైన భోజనమే పెడతాను" అంది.

"ఏం? ఇక్కడా భోజనం బాగోలేదా?" అడిగేడు.

"బాగానే వుంది. మధ్యాహ్నం ఆ హోటల్లో తిన్న కూరలూ, పచ్చళ్ళే రాత్రి యిక్కడానూ – అదే మనింట్లో అయితే ఉదయం చేసిన కూరలు రాత్రి వేస్తే తింటారా? అక్కడ ఆనపగాయ కూర.. ఇక్కడ కూటు. అక్కడ వంకాయ ముద్ద కూర.. ఇక్కడ ఫ్రై – అక్కడా దోసావకాయ, కందిపోడీ; యిక్కడా అవే..."

'దమయంతీ – పూబంతీ' ట్విన్ హోటల్స్. కవల హోటల్సన్నమాట! మేనేజ్‌మెంట్ ఒక్కరే కాబట్టి ఏ రైతు బజార్లోనో కూరలు టోకుగా కొనేసి వుంటారు–" అన్నాడు చక్రధరం.

◆ ❖ ◆

మర్నాడు ఉదయం ఏడు గంటలకి పదేళ్ళ పిల్ల ఎవరో గేటు దగ్గర నిలబడి వుంటే ఎవరో ఏమిటో అని కనుక్కున్నాడు చక్రధరం.

"మాయక్కకి జొరమండి. ఇయాల పన్లోకి రానని సెప్పమంది" అందది –

"వార్త తెచ్చేవా? మా తల్లే. ఇంకా వస్తుందేమోనని ఎదురు చూస్తూ కూర్చున్నాం కాదు. పోనీ నువ్వు రెండు గిన్నెలూ రెండు కంచాలూ తోమిపెడతావేంటి డబ్బులిస్తాను" అడిగేడు – చేస్తానన్నట్లు తలూపిందది. అలాగే తనకి చేతనైనంత మట్టుకి చేసిపెట్టి డబ్బులు తీసుకెళ్ళింది –

సునంద గదులూడ్చి, బట్టలుతికి స్నానానికి వెళ్ళింది.

చక్రధరం వంటలో నిమగ్నమయ్యాడు. ఒక స్టావ్ మీద కందిపప్పు వేయిస్తూ, మరో స్టావ్ మీద కాకరకాయ ముక్కల ఫ్రై చేస్తున్నాడు – ఈ లోగా కాలింగ్‌బెల్ మోగితే వెళ్ళి తీశాడు – ఎదురుగా సూటూ, బూటుతో ఓ కుర్రాడు చేతులు కడుక్కునే సబ్బేదో కొత్తగా వచ్చిందని డిమాన్‌స్ట్రేట్ చేస్తానన్నాడు. మా చేతులు మేం కడుక్కోగలం వద్దు మొర్రో అన్నా విన్పించుకోలేదా కుర్రాడు. కొనొద్దు. వినండి చాలు. మా కంపెనీ న్యూ ప్రోడెక్టు యిది – అరడజను సబ్బులు కొంటే ఒక చిన్న నేప్‌కిన్ ఫ్రీ అని బూట్లతోనే లోపలికొచ్చేశాడు. అతగాడిని అవతలికి నెట్టి తలుపేసేసర్కి తల ప్రాణం మోకాల్లో కొచ్చింది. 'ఆ కొత్త సబ్బేంటో గాని యిల్లంతా వాసనే' అనుకుంటూ ఫేను వేసి కిటికీ తలుపులు తీసేడు– వాసన ఎక్కువయిందేగాని తగ్గలేదు–

"స్టౌ మీదేదో మాడి ఛస్తోంది చూడండి" అంటూ బాత్రూంలోంచే కేక పెట్టింది సునంద. ఒక్కంగలో కిచెన్‌లోకి దూరేడు చక్రధరం. స్టౌ మీద అటు కందిపప్పు, యిటు కాకరకాయ ఫ్రై, బొగ్గుల్లా మాడి వున్నాయి.

"అందుకే కందిపప్పు వండాలన్నా కవిత్వం రాయలన్నా, కాన్‌సన్‌ట్రేషన్ ముఖ్యం అంటారు" అంది సునంద విషయం తెల్సుకుని–

"పోనీ యీ పూటకి నేను వండేయనా" అని కూడ అంది.

"వద్దు, నేనే ఏదో చేస్తాను" అన్నాడు చక్రధరం. తర్వాత బంగాళాదుంపల ముక్కలు వేయించి మెంతి మజ్జిగ చేసేడు. అల్మరాలోని ఉసిరి, చింత, ఆవకాయ పచ్చళ్ళ సీసాల్ని కిందికి దింపేడు.

'ఏమంటే అను, వంట వండటం ఓ పరీక్షే సుమా" అన్నాడు.

సునంద నవ్వి పూర్కుంది.

"ఆధరువులు తక్కువయ్యాయి కదా, దాన్ని కాంపెన్సేట్ చెయ్యడానికి సాయం కాలం ఫస్ట్‌షో సినిమా కెళ్దాం. ఎలాగూ గురువారమే కాబట్టి వస్తూ ఓ మంచి హోటల్లో టిఫిన్ చేసొద్దాం" అన్నాడు–

"బాబోయ్, మళ్ళీ హోటలేనా" అంది సునంద.

"ఈ మాటు వెళ్ళబోయే హోటల్లో భోజనం, టిఫినూ కూడ హోమ్లీగా వుంటాయంటారు. అదే నిజమైతే మీ పనిపిల్ల పథ్యం తిని వచ్చేవరకూ మనం అక్కడే సెటిల్ అయిపోవచ్చు" అన్నాడు చక్రధరం నవ్వుతూ.

"ఇంతకీ ఏ సిన్మావో...?" అడిగింది సునంద.

"వాళ్ళిద్దరికీ ఒక్కడే!"

"అదేం సిన్మా? ఇంతకీ ఆ ఒక్కడూ ఎవరు? మొగుడా? తండ్రా?"

"మరదే, తప్పులో కాలెయ్యడమంటే. సిన్మా చూసినవాడు చెప్పేడు – మాఁవట!" అంటూ నవ్వేడు–

సాయంకాలం తొందరగానే వెళ్ళినా టిక్కెట్లు దొరకలేదా సిన్మాకి. పదిరోజుల ముందే అడ్వాన్సుగా 'సౌకర్యం' ద్వారా టిక్కెట్లిచ్చేశారట – పోనీ 'సాక్షాత్కారం' పక్క హాల్లోనే ఆడుతోంది గదా.... ముక్తీ, మోక్షం, అని వెళ్ళేరు.

సినిమా చూస్తున్నంతసేపూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. సునంద, చక్రధరం–

తిరగొచ్చేటప్పుడు అడిగేడు చక్రధరం, "నీకెలా వుంది సిన్మా? సీన్లు బాగున్నాయి గదా" అని –

"దేవుడి ఫోటో చూపించి హీరోయిన్‌ని మొత్తం సాక్షాత్కరింపజేశాడు. ఆ సీన్లేనా మీకు బాగున్నవీ? ఆ డైరక్టర్‌నీ, నిర్మాతనీ మనుషుల్లేని దీవుల్లో వదిలిపెట్టి రావాలి" అంది సునంద కసిగా.

బజారు రోడ్డు దాటేక రిక్షాని ఆపించేడు చక్రధరం.

"ఇదేంటి యిక్కడ ఆపించేరూ" అడిగింది సునంద.

"వచ్చేముందు అనుకున్నాంగా" అన్నాడు చక్రధరం.

తలెత్తి చూసింది సునంద. 'సర్వం జగన్నాథం హోటల్' అని బోర్డు వుందక్కడ. దాని ముందు ఫుట్‌పాత్ మీద కొన్ని కుర్చీలూ, టేబుళ్ళూ వున్నాయి – వాటి మీద పిల్లా, మేకాతో వచ్చిన పెద్దలు కూర్చొని ఏవేవో తింటున్నారు – బల్లలు సరిపోక కొందరు కుర్చీల్లో కూర్చుని ఒక చేత్తో పళ్ళెం పట్టుకుని టిఫిన్లు తింటున్నారు – కొందరు నిలబడే కాఫీలూ, టీలూ తాగుతున్నారు – మరికొందరు ఫుట్‌పాత్‌కి దిగువున ఆగివున్న స్కూటర్ల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు – అంతా కోలాహలంగా వుంది.

"ఇదేనా హోటలు? లోపల బాగుచేయిస్తున్నారా?" అడిగింది అనుమానంగా.

"బాగు చేయించడం కాదు – అదెప్పుడూ అంతే. దాని కథ తర్వాత చెబుతాను గానీ ముందు పద" అన్నాడు చక్రధరం.

గుమ్మం దాటి అడుగు లోపలకు వేస్తే ఎడం చేతివైపు కౌంటర్లో టోకెన్లు యిస్తున్నారు. అక్కడో పెద్ద క్యూ వుంది– అలా ముందుకు వెళ్తే నాన్ ఎ.సి.హాలు, కుడివైపున ఓ చిన్న వెయిటింగ్ రూం. అందులోంచి ఎ.సి.హాల్లోకి దారి. వెయిటింగ్ రూంలో అప్పటికే ఇరవై మందికి పైగా కూర్చుని ఎదురుగా వున్న చిన్న టి.వి.లో ప్రోగ్రామ్స్ చూస్తున్నారు.

"లోపల ఖాళీ లేదు సార్, వెయిట్ చెయ్యాలి" అన్నాడు నీలం డ్రెస్సు వేసుకున్న సూపర్‌వైజర్.

"రండి చెబుతాను" అంటూ వెనక్కు తిరిగి, గబగబా రోడ్డు మీది కొచ్చేసింది సునంద.

"ఏమిటీ – ఇక్కడా వద్దా?" అడిగేడు చక్రధరం.

"ఆ సంతలో కూర్చుని తినడం నా వల్లకాదు బాబూ. చూడండి. భుజాలు రాసుకుంటూ, చేతుల్లోని ప్లేట్లు ఎవరేనా లాక్కుపోతారేమోనన్నట్లు హడావిడిగా తింటున్నారు – చూస్తుంటే దేశంలోని ఆకలంతా యిక్కడే వున్నట్లుంది" అంది.

"అందుకే ఏ.సీ.రూంలో కూర్చుందాం అన్నాను. పోనీ టిఫినేగదా, పార్సిల్ చేయించనా" అడిగేడు.

"అదే నయం" అంది సునంద.

చక్రధరం లోపలికెళ్ళి కూపన్లు కొనుక్కొచ్చేడు.

ఇంతలో ఆకుపచ్చ చొక్కా వేసుకున్న పన్నెండేళ్ళ కుర్రాడు ఆ పక్కగా వచ్చి, "ఇడ్లీ... వడ... దోసె... ఊతప్పం... చపాతీ, పరోటా...కాఫీ...టీ... ఏదైనా అర్ధరూపాయే" అంటూ అరుస్తున్నాడు–

"ఏవిఁటి... ఇక్కడ టిఫిన్లు అంతచవకా?" ఆశ్చర్యపోయింది సునంద.

"చవకా కాదు, ఏం కాదు, బయటకన్నా ఓ అర్ధరూపాయి తక్కువుంటాయంతే! అయితే రద్దీ సమయంలో కూపన్ తీసుకుని టిఫిన్లు తెచ్చుకోవడం సామాన్యులకు సాధ్యపడే విషయం కాదు – అంచేత యీ కుర్రాళ్ళు అర్ధరూపాయిస్తే, లోపల్నించి టిఫిన్లూ, కాఫీలూ తెచ్చిపెడతారు – దానికీ ఆ రేటు" అన్నాడు చక్రధరం.

"పుట్టి బుద్ధెరిగాక చాలా రకాలైన హోటళ్ళను చూశానుగానీ, ఎక్కడా ఇలాంటి పద్ధతి చూళ్ళేదు" అంది సునంద.

చక్రధరం నవ్వి వూరుకున్నాడు.

"మరి... యీ కుర్రాళ్ళు ఆ కూపన్లు పట్టుకుని పరారౌతేనో?"

"అలా చెయ్యరు. అందుకే ఆ ఆకుపచ్చ చొక్కా! హోటల్ వాళ్ళు రికగ్నైజ్ చేసిన కుర్రాళ్ళన్నమాట!" అన్నాడు.

సరిగ్గా అప్పుడే ఆకుపచ్చ చొక్కా కుర్రాడు టిఫిన్ పేకెట్లు తెచ్చేడు.

"ఇంతకీ యీ హోటల్‌కి 'సర్వం జగన్నాథం' అని పేరేమిటో? కొంపదీసి వెజ్, నాన్‌వెజ్ కలగాపులగం చేసేస్తారా ఏమిటి?" అడిగింది రిక్షా కదిలేక.

"ఓ చిన్న కొంటెపని ఓ పెద్ద అనుమానానికి ఎలా కారణభూతమయ్యిందో చూశావా? ఈ హోటల్ ప్రొప్రయిటర్ జగన్నాథం మొదట్లో ఓ పెద్ద హోటల్లో సర్వర్‌గా పనిచేశాడట– అతను అక్కడ్నించి వచ్చేసినా చాలామంది అతన్ని ఆ పేరుతోనే పిలిచేవారు. అతను చేసిన సర్వర్ పనే అతని ఇంటిపేరుగా ఖాయమైపోయింది. ఎవరో తుంటరివాళ్లు 'ర' కార పొల్లు మీద కాగితం అంటించేశారు. అలా 'ర్' కాస్తా 'ం' అయి, 'సర్వర్' కాస్తా 'సర్వం' అయిపోయింది. మొదట్లో జగన్నాథం కోపం తెచ్చుకున్నాడు. తర్వాత నవ్వుకుని సర్దుకుపోయాడు–" అంటూ ఆగేడు చక్రధరం.

"మరి వొటేలు కద గూడ సెప్తామన్నారు గదా అమ్మగారికి, సెప్పండి బాబూ"

ఆ ప్రశ్నకి తుళ్ళిపడ్డాడు చక్రధరం – అడిగింది సునంద కాదు – రిక్షావాడు!

"అవునవును చెప్పండి" అంది సునంద.

చక్రధరం గొంతు పెంచి చెప్పడం మొదలుపెట్టేడు –

"ఆరేళ్ళ క్రితం యీ ప్రాంతంలోనే జగన్నాథం ఓ చిన్న టీ స్టాల్ పెట్టేడు. టీ, కాఫీ, స్నాక్సూ అమ్మేవాడు. దగ్గర్లోనే మునిసిపల్ ఆఫీసూ, ఓ బ్యాంకూ, అతకంటె దగ్గర్లో ఓ జూనియర్ కాలేజీ వుండడం వల్ల బేరాలు బాగానే వుండేవి. క్రమంగా కూల్ డ్రింక్సూ, చాక్‌లెట్సూ, స్టూడెంట్స్‌కి కావాల్సిన రీఫిల్సూ, పెన్నులతో పాటు మధ్యాహ్నం మూడు గంటలవేళ సామాసా, బజ్జీ, పకోడా లాంటివి కూడా జతచేశాడు. కాలేజీ పిల్లలు, జంటలు జంటలుగా రావడం మొదలు పెట్టేరు. వ్యాపారం బాగా వుపందుకుంది. రెండేళ్ళ తర్వాత ఆ పక్కనే వున్న షాపుల్లో ఓ గది అద్దెకు తీసుకుని అందులోకి మారేడు – ముందు భాగంలో రేకులు దింపి నీటుగా వుండేట్లు నాలుగు బల్లలూ – కుర్చీలూ వేసేడు.

మరో ఆర్నెల్లలో బాగానే పుంజుకున్నాడు. ఆ పక్కనే కొత్తగా కట్టిన బిల్డింగులో కొన్ని గదులు అద్దెకు తీసుకుని పార్లర్ ఓపెన్ చేసేడు. ఏ ముహుర్తాన అందులోకి మారేడో గాని రోజు మొత్తంలో కొద్ది గంటలు తప్ప అది మూసి వుండేది కాదు – రెండేళ్ళు తిరక్కుండా ఆ పక్కనే ఉన్న ఒక పాతిల్లు కొనుక్కొని, తగినట్లు మార్చుకుని అందులోకి మార్చేడు – ఇప్పుడు పాతిక ముప్ఫయ్ మంది పనివారిని పోషిస్తున్నాడు – ఇంత ఎత్తుకు ఎదిగినా సర్వం తానే అయి అన్నీ చూసుకుంటాడు. శుచీ, రుచీ, శుభ్రత – వీటికి ఎక్కడా కాంప్రమైజ్ కాడు."

కథ పూర్తి చేసేడు చక్రధరం.

"అందుకే బాబూ కష్టం తెల్సినోడు ఎదుటోడి కష్టాన్ని అర్థం చేసుకుంటాడంటారు" అన్నాడు రిక్షావాడు ఇంటి ముందు రిక్షా ఆపుతూ.

"అదేమిటి?" అంటూ వాడి వంక ఆశ్చర్యంగా చూశాడు చక్రధరం.

"మీకు తెల్దా బాబూ – ఆ జగన్నాధానికి పెళ్ళి కాలేదు. సర్వర్‌గా జేరే ముందు తిండికి మా యిబ్బంది పడ్డాడు" అన్నాడు రిక్షావాడు తాపీగా బీడీ నోట్లో పెట్టుకుని వెలిగిస్తూ.

చక్రధరం ఏం మాట్లాడలేదు – ఏమన్నా అడిగితే మరో కథ చెబుతాడేమోనని భయపడి డబ్బులిచ్చి యింట్లో కొచ్చేశాడు.

"పోన్లెండి, ఆ జగన్నాథం యీ పూటకి మనని ఆదుకున్నాడు. రేపట్నించి అతని అవసరం ఉండదు మనకి" అంది సునంద టిఫిన్ పొట్లాల్ని విప్పుతూ.

"అదేం పాపం... ఉపవాస దీక్షా?"

'కాదు, సెలవు కేన్సిల్ చేసుకుని డ్యూటీలో చేరుతున్నాను. సెలవునీ, ఎల్.టి.సీ.నీ ఎన్‌కేష్ చేసుకుంటున్నాను" అంది సునంద.

చక్రధరం మారు మాట్లాడలేదు.

◆ ❖ ◆